క్లుప్తంగా

బొల్లాపల్లి ఏవోగా వీరయ్య

బొల్లాపల్లి: మండల పరిషత్ కార్యాలయ ఏవోగా డి.వీరయ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా దుగ్గిరాల మండలం నుంచి బొల్లాపల్లి మండల ఏవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఈపూరు మండల ఎంపీడీవో, బొల్లాపల్లి మండల ఇన్చార్జి ఎంపీడీవో కె.ప్రభాకరరావు తెలిపారు.

ఉల్లాస్‌పై అవగాహన

శావల్యాపురం: నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు కార్యాలయం అధికారులు సిబ్బందితో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అందరి జీవితాల్లో నేర్చుకునే అభ్యసనాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు వయోజన విద్య ద్వారా అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ప్రతి పది మంది మహిళలకు కలిపి ఒక్కో విద్య వలంటీర్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు విద్య కల్గియుండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం వెలుగు అధికారి ఏపీయం జి.వాసుబాబు సీసీలకు అక్షర వెలుగు పుస్తకాలు అందజేశారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి వెంబడి నుంచి రైల్వే స్టేషనుకు వెళ్లే రహదారి మార్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్ చందు స్థానిక ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావుకు శుక్రవారం విన్నవించారు. ఈ రహదారిలో వ్యాపారులు ఇష్టానుసారంగా ఆక్రమణలు చేయటం వల్ల ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండుగల సందర్భంగా వ్యాపారస్తులు రోడ్డుపై అమ్మకాలు చేస్తున్నారని తద్వారా ఆటోలు బైకులు రాకపోకలు తీవ్ర అంతరాయం వాటిల్లితుందన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల, సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందన్నారు. సత్వరమే ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలన్నారు.

వాలీబాల్ జట్టుకు సొలస విద్యార్థినులు



నాదెండ్ల: యడ్లపాడు మండలం సొలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు గుంటూరు జిల్లా నుంచి రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఉన్నత పాఠశా లలో తొమ్మిదో తరగతి చదువుతున్న వెంగళశెట్టి ఐశ్వర్య, జె మేరి సునీతలు శుక్రవారం మంగళగిరి నియోజకవర్గం నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో జరిగిన అండర్ 14 బాలికల విభాగం పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు తరపున ఆడారు. చక్కటి ప్రతిభ చూపిన ఇరువురినీ రాష్ట్రజట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకట కృష్ణమాచారి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రజట్టుకు ఎంపికకావటం సంతోషకరమన్నారు. వీరికి శిక్షణనిచ్చిన పీఈటీ కారసాల మధు, ఉపాధ్యాయులను అభినందించారు.

వివాహిత ఉసురు తీసిన కలహాలు



ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకొని మృతిచెందింది. పోలీసులు కథనం ప్రకారం.. ఇనిమెళ్ల గ్రామానికి చెందిన చవల భూలక్ష్మి (35) కొద్దిరోజులుగా కుటుంబ కలహాలతో సతమతమవుతోంది. అయితే వీటిని తట్టుకోలేక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.. మృతురాలికి 15 సంవత్సరం క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి బత్తుల నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతి

చిలకలూరిపేటటౌన్: తల్లి తనకు డబ్బులు ఇవ్వలేదని బెదిరించేందుకు ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని వడ్డెరపాలెంకు చెందిన శిఖరం శివమ్మకు 20 ఏళ్ల కిందట కారంపూడి మండలం చింతపూడి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. రెండేళ్ల కిందట భర్త అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. దీంతో శివమ్మ పట్టణంలోని తల్లివద్దకు వచ్చి ముఠాకూలీగా పనులు చేసుకుంటూ జీవిస్తోంది. గతనెల 25వ తేదీన తల్లిని డబ్బులు కావాలంటూ శివమ్మ అడగ్గా ఇవ్వకపోవడంతో ఎలుకల మందు తిన్నది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివమ్మ (40) శుక్రవారం మృతి చెందింది. చికిత్స పొందే సమయంలో మృతురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతిరాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సర్వర్ పనిచేయక.. వేచి ఉండే ఓపికలేక..



ఎన్టీఆర్ పెన్షన్‌కానుక - సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ శుక్రవారం నత్తనడకన సాగింది. ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది గంటన్నరపాటూ పింఛన్లను పంపిణీ చేశారు. సుమారు 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ సర్వర్ మొరాయించటంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో పింఛనుదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సచివాలయ సిబ్బంది వెనుదిరిగి సచివాలయాలకు చేరుకున్నారు. దీంతో లబ్ధిదారులు కూడా వారి వెంటే సచివాలయాల వద్దకు చేరుకుని చెట్ల క్రింద, బెంచీలపై నిరీక్షించారు. మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత తిరిగి సర్వర్ పనిచేయటంతో లబ్ధిదారులకు ఆలస్యంగా నగదు పంపిణీ చేశారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణిని వివరణ కోరగా, సర్వర్ పనిచేయక సుమారు 5 గంటల పాటూ పింఛన్ల పంపిణీ నిలిచిందని, అయితే తొలిరోజు సాయంత్రానికి 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు.

\- నాదెండ్ల

వాడవాడలా అమరజీవికి ఘననివాళి

నరసరావుపేట: ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రదర్శించిన పట్టుదల, దృఢ సంకల్పం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు సేవా సమితి ఆధ్వర్యంలో శివునిబొమ్మ సెంటర్‌లోని అమరజీవి విగ్రహం, చిత్రపటాలకు పూలమాల, పూలు చల్లి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు సేవా సమితి అధ్యక్షులు మిరియాల నరహరి, సెక్రటరీ కట్టమూరి ఆంజనేయులు, కోశాధికారి కొత్తూరు కిషోర్, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నిడమానూరు సురేంద్ర, కొత్త మాసు మల్లారావు, భవిరిశెట్టి నాగేశ్వరరావు, మోహన్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): ప్రాణత్యాగంతో ఆంధ్రరాష్ట్రానికి ఊపిరిపోసిన మహానుభావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చిలకలూరిపేట: మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని భాస్కర్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బి.శ్రీనునాయక్, కె.నాగేశ్వరరావు, టి.వెంకట నగేష్, ఎస్.నాగరాజు, బి.చిన్నానాయక్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అమరజీవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఆర్యవైశ్యులు

నాదెండ్ల. భాషా సంయుక్త రాష్ట్రాల సాధనకు తన ప్రాణాలను అర్పించి తెలుగు వారికి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని గణపవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అయితా శ్రీనివాసరావు చెప్పారు. బొడ్డురాయి సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో తూనుగుంట వెంకట అనిల్‌కుమార్, పోలిశెట్టి ఆంజనేయులు, రిటైర్డ్ ఉద్యోగులు సింగయ్య మాస్టారు, శివరామకృష్ణ ఉన్నారు.

నరసరావుపేట: భాషా ప్రతిపాదికన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొనియాడారు. పట్టణంలోని శివునిబొమ్మ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి, చిత్రపటాలకు "నివాళులు అర్పించారు. రాష్ట్ర బులియన్ మార్చంట్ అధ్యక్షులు కపిలవాయి విజయకుమార్, నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు వనమా సాంబశివరావు, మాజీ అధ్యక్షులు మాజేటి వెంకటేష్, కొత్తూరి కిషోర్ బాబు, పొట్టి శ్రీరాములు సేవా సమితి అధ్యక్షులు మిరియాల నరహరిరావు పాల్గొన్నారు.



వినుకొండలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం బయట ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు పసుమర్తి ఆదినారాయణ, పాదర్తి రామకోటేశ్వరరావు, కొప్పు కోటయ్య, అర్వపల్లి వీరాంజనేయులు,సరికొండ తిమ్మరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- గుండె రక్తనాళాల్లోని కాల్షియంను ఓఏ టెక్నాలజీతో తొలగింపు
- ఎండీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: స్థానిక డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో అట్లూరి శ్రీధర్ అనే 53ఏళ్ల పెషెంట్‌కు గుండె రక్తనాళాల్లో పేరుకుపోయిన క్యాల్షియంను ఓఏ టెక్నాలజీ ద్వారా తొలగించి స్టంటు వేసి పునర్జన్మ ప్రసాదించి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన శ్రీధర్ తీవ్రమైన గుండె నొప్పితో విజయవాడలో కొన్ని ప్రముఖ హాస్పిటల్స్ చుట్టూ తిరిగి సన్నిహితుల సమాచారం మేరకు తమ హాస్పిటల్‌లోని అనుభవజ్ఞులైన ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోటా శభరి గిరీష్‌ను సంప్రదించడం జరిగిందన్నారు. పేషెంట్ అంగీకారంతో ఆర్బిటైల్ ఆర్థరెక్టమి అనే ప్రముఖ రేర్ అడ్వాన్స్‌డు ప్రొసీజర్ ద్వారా ఓఏ అనే వరల్డ్ క్లాసిక్ ఎక్విపెమెంట్ సహాయంతో శస్త్రచికిత్స చేసి వందశాతం విజయవంతం చేశామన్నారు. ఇలాంటి అరుదైన సర్జరీలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహా నగరాల్లో మాత్రమే చేస్తుంటారని, ఇప్పుడు మన పల్నాడు జిల్లా నరసరావుపేటలో తమ హాస్పిటల్‌లో నిర్వహిస్తూ ఎంతోమంది గుండె పోటుకు గురైన ప్రజలు ప్రాణాలు కాపాడటం చాలా సంతోషంగా ఉందని డాక్టర్ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సమావేశంలో డాక్టర్ శబరి గిరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో పేషెంట్‌తోపాటు డాక్టర్లు శ్రీనివాస రెడ్డి, శభరి గిరీష్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిలకలూరిపేటకు చెందిన మంద్రు తిరుమల కిషోర్, భావనారుషినగర్ వాసి కుమ్మరిగుంట లీలాకృష్ణ స్నేహితుడితో కలిసి టీ తాగేందుకు శుక్రవారం బయలు దేరారు. నరసరావుపేట సెంటర్ నుంచి టీడీపీ కార్యాలయం వద్ద కేపీ రెస్టారెంట్ వైపు మలుపు తిప్పుతుండగా, అదే సమయంలో నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న బైక్ వీరి స్కూటీని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో లీలాకృష్ణ(30)కు తీవ్రగాయాలు కాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

సంక్షిప్తం

• నిత్యవసరాలు పంపిణీ చేసిన అసిస్ట్

చిలకలూరిపేటటౌన్: ప్రముఖ స్వచ్ఛంగా సేవా సంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో ఒంటరి మహిళలకు నిత్యవసర సరుకుల్ని శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు, ప్రమీల దంపతులు, అసోసియేట్ డైరెక్టర్ కృష్ణ హరీష్, విష్ణుప్రియలు పాల్గొన్నారు.

• సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి మరియు జాతీయ ఏక్తా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సుందర్ రెడ్డి, ఏవోరవి, ఎంఆర్‌సీ ప్రభాకరరావు, శ్రీనివాసరావు, మహేంద్ర పాల్గొన్నారు.

• అన్నదాన కార్యక్రమం

వినుకొండ (నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం భవనం ఆవరణలో విశ్రాంత హెచ్ఎం అవ్వారు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భువనగిరి సుబ్రహ్మణ్యం , పి.కృష్ణకుమారి, జయలక్ష్మి, ఆదిసామ్రాజ్యం, రామలింగేశ్వరరావు, వై.వి.సుబ్బయ్య శర్మ, గోపి, కృష్ణమూర్తి, ఎం.వి.శర్మ, దుబ్బల దాసు, దీక్షితులు, శంకర్‌రావు, నాగేంద్రుడు, శేషయ్య, ఆదిరాములు, సుందరరావు, రాఘవయ్య, మస్తాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• పనుల పురోగతి పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ముప్పరాజువారిపాలెం, రవ్వవరం గ్రామపంచాయతీలలోని సచివాలయాలు, ఆర్‌ఎస్‌కే, హెల్త్ సెంటర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరి ఉమాదేవి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిడమానూరి మాధవిశ్రీను, పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

• ఒంటరి మహిళలను ఆదరించాలి

చిలకలూరిపేట: నిరుపేద ఒంటరి మహిళలను ఆదరించి ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అసిస్ట్ స్వచ్ఛంధ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జాస్తి కృష్ణ హరీష్ చెప్పారు. అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో 114 మంది ఒంటరి మహిళలకు రూ. 2లక్షలు విలువ చేసే నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఒంటరి మహిళలను గుర్తించి బియ్యం, కందిపప్పు, వంటనూనె, గోధుమపిండి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాస్తి ప్రమీల, విష్ణుప్రియ పాల్గొన్నారు.

• యడ్లపాడులో డీఈవో పర్యటన

నాదెండ్ల: మండల కేంద్రమైన యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని తరగతుల విద్యార్థులతో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆరో తరగతి విద్యార్థులతో హిందీ పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాన్ని అంచనావేశారు. 8వ తరగతి విద్యార్థులతో సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మూడు భాషల్లో తమ గురించి స్వంతంగా వ్యక్తపరిచేలా నేర్పాలన్నారు. ముగ్గురు డ్రాపవుట్స్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు పనిలోకి వెళ్తున్నారని గుర్తించి వారిని తిరిగి పాఠశాలకు పంపి చదివించాలని కోరారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

• జాతీయ టైకాండో పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థిని

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి టైక్వాండో ఛాంపియన్‌షిప్–2024 పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని వి.లక్ష్మీ తులసీతన్మయ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూధనరావు శుక్రవారం తెలిపారు. తెనాలిలో అక్టోబర్ 26, 27 తేదిలలో నిర్వహించిన 4వ రాష్ట్రస్థాయి సీనియర్స్ టైక్వాండో పోటీలలో లక్ష్మీతులసి 53కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. అలాగే మరో విద్యార్థి ఆర్.వి.బాలాజీనాయక్ జూనియర్ బాలురు 51కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను పలువురు కళాశాల పాలకవర్గ సభ్యులు అభినందించారు.

దిగుబడిపై ఆశలు ఆవిరి

- వర్షాలకు దెబ్బతిన్న పత్తి
- ట్రాక్టర్లతో దున్నేస్తున్న రైతులు

నాదెండ్ల: ఇటీవలి భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతినటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపక్రమిస్తున్నారు. వర్షాలకు పత్తి మొక్కలకు అడుగునున్న కాయలు దెబ్బతినటం, పూతపిందె రాలటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో పత్తిపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. గణపవరం గ్రామానికి చెందిన రైతు మందా సురేష్ కొంత పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఎకరాకు రూ.8 వేలు చొప్పున కౌలు చెల్లించాడు. మరో రూ.30 వేలు వ్యవసాయ పెట్టుబడి పెట్టాడు. ఇటీవలి వర్షాలకు పంట దెబ్బతింది. కొద్దిరోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉండటంతో చెట్టుకున్న కాయలకు పగిలాయి. సుమారు రెండు క్వింటాళ్ళకు పైగా దిగుబడి వచ్చింది. ఇక పత్తిపై ఆశలు లేకపోవటంతో జీవాలు మేపుకునేందుకు పశువుల కాపరులకు పొలాన్ని అప్పగించాడు. ఇదేరోజు సాయంత్రం ట్రాక్టర్‌తో పంటను దున్నేశాడు. ఎకరాకు సుమారు రూ.25 వేలు నష్టపోయినట్లు వాపోతున్నాడు.



ట్రాక్టర్‌తో పత్తి చేనును దున్నేస్తున్న రైతు మందా సురేష్



పత్తి చేనులో మేస్తున్న జీవాలు

ఉద్యోగ విరమణ ఓ గొప్ప అవకాశం

ఎస్పీ శ్రీనివాసరావు – ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వెంకయ్య దంపతులకు సన్మానం

నరసరావుపేట: ఉద్యోగ విరమణ అనేది జీవితంలో మన కోసం మనం గడపడానికి వచ్చిన అవకాశంగా భావించి, కుటుంబం, బంధుమిత్రులతో కలిసి సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ అక్టోబరు 31తో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ అట్ల వెంకయ్య ఉద్యోగ విరమణ పొందారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెంకయ్య దంపతులను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ విరమణ ఎదుర్కోవలసిన ఘట్టమన్నారు. ఇప్పటి వరకు ప్రజలకు సేవ చేయటంలో తనమునకలై అహర్నిశలు శ్రమిస్తూ ఒక్కసారిగా ఉద్యోగ విరమణ పొందటం కొంచెం బాధ కలిగిస్తుందన్నారు. పోలీస్ శాఖలో ఇన్ని రోజులు సేవలందించడానికి వారికి సహకరించిన కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏ అవసరం వచ్చినా పోలీస్ శాఖ తరఫున మా వంతు సహాయాన్ని అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. మిగిలిన శేష జీవితం ఆరోగ్యంపై దృష్టి సారించి ఆహ్లాదకరంగా గడపాలని తోటి ఉద్యోగులు కాంక్షించారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీరెడ్డి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యాలరావు పాల్గొన్నారు.



వెంకయ్య దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఘనంగా ఇందిరాగాంధీ, పటేల్‌కు నివాళులు

నరసరావుపేట: స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, దేశ మొదటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ ఖలిస్తాన్ పేరిట దేశం విడిపోకుండా వుండాలన్న తీసుకున్న నిర్ణయానికి తన ప్రాణాలను ఫణంగా పెట్టారన్నారు. దేశాన్ని అన్నిరంగాలలో ముందుండేలాగ తన పరిపాలనను కొన సాగించారని, అనునిత్యం పేదల సంక్షేమం కోసం ఆలోచిస్తూ వారికి ఆహారం, దుస్తులు, నివాసం ఖచ్చితంగా వుండాలనే ఉద్దేశ్యంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశ ప్రజల చేత 'అమ్మ'అని పిలిపించుకున్న గొప్ప వ్యక్తి అంటూ కొనియాడారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా నడుచుకొవాలని కోరారు.నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.ఏం.బాషా, రాఘవరపు శ్రీనివాస్, సత్యం, సునీల్ సింగ్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి వెంబడి వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

శావల్యాపురం: మండల కేంద్రమైన శావల్యాపురంలో గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి వెంబడి ఉన్న వ్యర్థాలపై గత నెల 28న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి బొడ్డు యేకోబు మాట్లాడుతూ ఎంపీడీవో అదేశాలు మేరకు గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గం వెంబడి ఉన్నటువంటి వ్యర్థాలను పిచ్చి చెట్లు, కంప చెట్లు తొలిగింపు పనులు పొక్లయినర్ ద్వారా జరుగుతున్నాయన్నారు. అలాగే చెత్తా సంపద కేంద్రం ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉందని సత్వరమే మరమ్మతులు చేయించి గ్రామంలో సేకరించిన వ్యర్థాలను సంపద కేంద్రానికి తరలించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామంలో చెత్తా సేకరించే పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికీ నెలకు రూ.6 వేలు రూపాయలు పెండింగ్‌లో లేకుండా వేతనాలు అందజేశామన్నారు.



పొక్లయినర్ సాయంతో వ్యర్థాలను తొలిగిస్తున్న పంచాయతీ అధికారులు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు శారద విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శ్రీశారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కె రత్నజ్యోతి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. గతనెల 30వ తేదీన అమరావతి మండలం రావెల జెడ్పీహైస్కూల్లో సాఫ్ట్‌బాల్ అండర్ -17 బాలుర విభాగంలో జరిగిన జిల్లాస్థాయి సెలక్షన్‌లో ఎస్‌జీఎఫ్ వారి ఆధ్వర్యంలో హైస్కూల్‌కు చెందిన వాడల భవాని మల్లేష్ ఎంపికయ్యాడు.అలాగే ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో ఎం నాగచైతన్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వీరిద్దరూ ఈనెలలో వివిధ ప్రాంతాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పల్నాడు జిల్లా జట్టు తరుపున పాల్గొనున్నట్లు తెలిపారు.



క్రీడాకారులతో పాఠశాల ఉపాధ్యాయులు

నరసరావుపేటలో దీపం పథకం ప్రారంభం

హాజరైన జేసీ సూరజ్, ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: పట్టణంలో దీపం 2.0 పథకాన్ని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్కు వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందన్నారు. ఈ పథకం అమలుకు తమ ప్రభుత్వం రూ.894 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19న పెన్షనర్స్ సమావేశం

నరసరావుపేట ఈస్ట్: తాహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెన్షన్ భవన్‌లో ఈనెల 19వతేదీన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పల్నాడుజిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు శుక్రవారం తెలిపారు. పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.